## క్లుప్తంగా

### కార్మిక సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట



మాట్లాడుతున్న ఆగయ్య

సిరిసిల్లటౌన్: కార్మిక సంక్షేమానికి బీఆర్ఎస్ మొదట్నుంచి పెద్దపీట వేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. అన్నిరంగాల కార్మికుల ఉపాధి, బీమా, రక్షణ పరమైన సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్నారన్నారు. కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో మే డే సందర్భంగా భారతీయ రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్దెత్తున వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాతలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న శరత్‌రావు

ముస్తాబాద్: అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. శనివారం ముస్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలు, వడగండ్లతో రైతులు నష్టపోయారని, ఇప్పటికే వ్యవసాయ, రెవెన్యూశాఖలు సర్వే నిర్వహించాయన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారని వివరించారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, తదితరులున్నారు.

### డ్యాన్స్ శిక్షణ శిబిరం ప్రారంభం




శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: డ్యాన్స్ నేర్చుకోవడం వల్ల పిల్లలు, పెద్దలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో శనివారం డ్యాన్స్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు వేసవి సెలవుల్లో డ్యాన్స్ శిక్షణ ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండారపు కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

### వికలాంగులకు రాయితీ బస్ పాసులు

చందుర్తి: చందుర్తి మండలం రామన్నపేటలోని వికలాంగులకు, అంధులకు రాయితీ బస్సు పాసులను సర్పంచ్ దుమ్ము అంజయ్య ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. గ్రామంలోని 15 మందికి పాసులను అందజేసినట్లు ఆర్టీసీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మిగతా గ్రామాల్లోని వికలాంగులకు వారం రోజుల్లో పాసులు అందిస్తామని తెలిపారు. రఘు, ముదిగంపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

వీర్నపల్లి: చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఎస్పీ మండల అధ్యక్షుడు జింక నాగరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 7న తెలంగాణ భరోసా పేరుతో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బీఎస్పీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల ప్రశాంత్, గర్జనపల్లి సెక్టార్ అధ్యక్షుడు గుంటుకు తిరుపతి, బూత్ అధ్యక్షుడు గజ్జెల శ్రీనివాస్, దనిషరపు నర్సయ్య, లింగంపల్లి శంకర్, జింక శ్రీకాంత్, దాసరి కళ్యాణ్, మల్యాల వివేక్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతగా లేదని గ్రామస్తులు శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ చల్ల నారాయణ సీసీ రోడ్డు నిర్మాణానికి 20 ఎంఎం కంకరకు బదులుగా 30ఎంఎం, 40ఎంఎం కంకర, తక్కువ సిమెంట్ వాడి రోడ్డు నాణ్యతగా చేయలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు

# కూల్‌కూల్.. స్విమ్మింగ్‌పూల్

- ఈతపై ఆసక్తి చూపుతున్న చిన్నారులు, పెద్దలు
- వేసవి తాపం నుంచి ఉపశమనం
- కిటకిటలాడుతున్న మున్సిపల్ ఈత కొలను



చిన్నారికి ఈత నేర్పిస్తున్న కోచ్




స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు, యువకులు

### నైపుణ్యం గల శిక్షకుడితో..

ఈత రాని వారికి నైపుణ్యం గల శిక్షకుడితో స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు. కొత్తగా ఈత నేర్చుకునే వారికి ఈతలో మెలకువలు నేర్పిస్తూ, జాగ్రత్తలు పాటిస్తూ నేర్పిస్తున్నారు. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కాగా స్విమ్మింగ్ పూల్‌కి వెళ్లేవారికి పలు అలర్జీలు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కళ్లకు గాగుల్స్, జుట్టు తడవకుండా క్యాప్స్, స్విమ్ సూట్స్ ట్యూబులతో పాటు పలు జాగ్రత్తలు పాటించాలి.

సిరిసిల్లఅర్బన్: ఎండలు మండుతున్న నేపథ్యంలో వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. దానిలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌కి ఈత నేర్చుకోవడానికి చిన్న, పెద్ద వయస్సుతో సంబంధం లేకుండా వస్తున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్ ఉదయం, సాయంత్రం జనాలతో కళకళలాడుతోంది. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో చిన్నారులకు ఈత నేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

**ఈతతో ప్రయోజనాలెన్నో..**

ఈత కొట్టడం వల్ల ఎండ నుంచి ఉపశమనం పొందడమే గాక మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. శరీరం మొత్తానికి వ్యాయామం చేసినట్లు ఉంటుంది. రక్త ప్రసరణ మెరుగవ్వడంతో పాటు చురుకుదనంగా ఉంటారు. అధిక బరువుతో బాధపడేవారు శరీర ఆకృతిని మెరుగుపరుచుకోవడానికి స్విమ్మింగ్‌ను ఆశ్రయిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రులు ఉదయం, సాయంత్రం వేళ చిన్నారులను తీసుకొని స్విమ్మింగ్ పూల్‌కి వస్తున్నారు. ఉదయం 6 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 7గంటల వరకు స్విమ్మింగ్ చేసేందుకు సమయం కేటాయించారు. ప్రతి గంటకు రూ.60 వసూలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ఆరోగ్యానికి మంచిది



రోజూ గంట పాటు స్విమ్మింగ్ చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే సమయం దొరికనప్పుడల్లా ఈత కొట్టేందుకు వస్తుంటా. ఈత రానివారికి స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు నైపుణ్యం గల శిక్షకులతో నేర్పిస్తున్నారు. – తిరుపతి, సిరిసిల్ల

### రోజూ స్విమ్మింగ్ చేస్తా



నేను ఏడాదిగా రోజూ ఈతకు వెళ్తున్న. ఈత కొట్టేందుకు వెళ్లినప్పటి నుంచి శారీరకంగా, మానసికంగా ఉల్లాసం కలుగుతుంది. నాతో పాటు మరికొంత మంది స్నేహితులతో కలిసి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లడం అలవాటుగా మారింది. – సమ్మయ్య, సిరిసిల్ల

### చాలా మంది వస్తున్నారు



వయస్సుతో సంబంధం లేకుండా చాలా మంది ఈత నేర్చుకోవడానికి వస్తున్నారు. మరికొందరు శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు ఈత కొడుతున్నారు. ఎండాకాలం కావడంతో రోజూ దాదాపు 150 మంది వరకు వస్తున్నారు. ఈత రాని వారికి ప్రత్యేక మెలకువలతో జాగ్రత్తలు పాటిస్తూ నేర్పిస్తున్నాం. – శేఖర్, శిక్షకుడు

### ఈత నేర్చుకోవడానికి వచ్చాను



వేసవి సెలవులు కావడంతో స్కూల్ బంద్ చేశారు. అందుకే ఈత నేర్చుకోవడానికి స్విమ్మింగ్ పూల్‌కి వచ్చాను. మొదట్లో నీళ్లలో దిగగానే భయం వేసింది. తర్వాత కొంచెం కొంచెం ఈదుతున్నా. – కమల్, సిరిసిల్ల

# ట్రీగార్డుల బిల్లులు చెల్లించండి

- మండల సభలో సర్పంచ్‌ల ఆవేదన




మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

గంభీరావుపేట: గతేడాది హరితహారంలో నాటిన మొక్కలకు పెట్టిన ట్రీ గార్డుల డబ్బులు ఇంతవరకు రాలేదని, ఈసారి ట్రీ గార్డులకు డబ్బులు చెల్లిస్తేనే హరితహారంలో పాల్గొంటామని, అప్పులు తెచ్చి కొనలేమని సర్పంచ్‌లు మండల సభలో ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వంగ కరుణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. త్వరలో ప్రారంభమయ్యే హరితహారంలో ట్రీ గార్డులను ప్రభుత్వమే అందజేయాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మొక్కలు నాటి ట్రీగార్డులు పెట్టకపోతే అధికారులు సర్పంచ్‌లను లక్ష్యంగా చేసుకుని మెమోలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొనుగోళ్లు చేపట్టాలి**

వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు దాటినా ఇంతవరకు కొనుగోళ్లు ప్రారంభించలేదని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎంపీటీసీలు బాలమణి, రాజేందర్‌రెడ్డి కోరారు. కాగా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి సీపీఆర్‌పై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. పలు శాఖల అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ కరుణ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మండలం నుంచి మూడు గ్రామ పంచాయతీలకు పచ్చదనం పరిశుభ్రతలో జిల్లా స్థాయిలో అవార్డులు వచ్చాయని, గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు రావడం గర్వకారణమన్నారు. అవార్డు అందుకున్న సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులును సన్మానించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు హైమద్, వైస్ ఎంపీపీ లత, సెస్ డైరెక్టర్ నారాయణరావు, విండో చైర్మన్ సురేందర్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంగన్‌వాడీ వార్షికోత్సవం



వేడుకలు జరుపుతున్న టీచర్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోతె సరిత మాట్లాడుతూ, కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని జైసేవాలాల్ భుక్యారెడ్డితండా, వట్టిమల్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. సర్పంచ్ లకావత్ ప్రమీల, కొమ్ము స్వప్న, ఉపసర్పంచ్ తిరుపతి, అంగన్‌వాడీ టీచర్లు ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన వ్యక్తులకు ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన రామస్వామి అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు కోల్పోయాడు. స్పందించిన చేయూత మిత్ర ఫౌండేషన్ వారు శనివారం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. రామస్వామి భార్య ఫౌండేషన్ సభ్యులతో పదో తరగతి చదువుకోగా వారంత కలిసి ఆర్థికసాయం చేశారు. మరికొంత మంది దాతలు సాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సభ్యులు దూస శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రవి, గోపి, ఆంజనేయులు, శంకర్, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**నిమ్మపల్లిలో..**

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన నవీన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల నాయకులు నాగండ్ల భూమేశ్ ఆధ్వర్యంలో రూ.5,500 ఆర్థిక సాయం అందజేశారు. దర్ర రవి, అజీంపాషా, అనుముల అంజి, ఇద్దగిరి నరేశ్, చెకుట మధు, రాజశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం చంద్రంపేటలో సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కౌన్సిలర్ పాతూరి రాజిరెడి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం ప్రారంభం**

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ వంగ కరుణ శనివారం ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ చైతన్య, ఎంపీటీసీ రేణుక, ఉపసర్పంచ్ రాజు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఐకేపీ సీసీ సురేందర్, దయాకర్‌రావు, సురేందర్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# అంటరానితనాన్ని రూపుమాపాలి



బోయినపల్లి: కార్యక్రమంలో అధికారులు, నాయకులు

వేములవాడరూరల్: గ్రామాల్లో అంటరానితనాన్ని రూపుమాపాలని వేములవాడ రూరల్ ఎస్ఐ నాగరాజు అన్నారు. రూరల్ మండలం నమిలిగుండుపల్లి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పౌరహక్కులకు ఎవరు కూడా భంగం కలిగించవద్దన్నారు. అనంతరం అధికారులు గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. రెవెన్యూ సిబ్బంది అంజద్, గ్రామస్తులు, కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొట్టెపెల్లి సుధాకర్, సర్పంచు ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, ఆర్ఐ భూపేశ్, కొంకటి మధు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రభాకర్ హెచ్చరించారు. మండలంలోని దెగావత్ తండా గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ దెగావత్ సరిత, డీటీ మల్లయ్య, ఎంపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ లేఔట్లలో పంచాయతీ బోర్డు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఔట్ స్థలాల్లో పంచాయతీ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో కార్యదర్శి దేవరాజ్ ఆధ్వర్యంలో బోర్డులను ఏర్పాటు చేసి ఆ స్థలాలను ఎవరు కొనుగోలు చేయొద్దని సూచించారు. ఈసందర్భంగా సర్వేనంబర్ 175, 130లలో ఇంటి స్థలాలకు కొనుగోలు చేయొద్దని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబర్లలో రియల్టర్లు క్రయవిక్రయాలు జరిపే ప్రమాదం ఉందని కార్యదర్శి దేవరాజు సూచించారు. ఒకవేళ ఎవరైన కొంటే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని తెలిపారు. ఈ సర్వే నంబర్ల ప్లాట్లను కొనుగోలు చేసేవారు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# రెండో రోజుకు పంచాయతీ కార్యదర్శుల సమ్మె



తంగళ్లపల్లిలో సంఘీభావం ప్రకటిస్తున్న ఎంపీడీవో

తంగళ్లపల్లి/కోనరావుపేట/వీర్నపల్లి/బోయినపల్లి/గంభీరావుపేట/రుద్రంగి: తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని జూనియర్, అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. శనివారం జిల్లాలోని తంగళ్లపల్లి, కోనరావుపేట, వీర్నపల్లి, బోయినపల్లి, గంభీరావుపేట, రుద్రంగి తదితర మండలాల్లో జేపీఎస్‌ల సమ్మెరెండో రోజు కొనసాగింది. సమ్మెకు పలువురు అధికారులు, నాయకులు సంఘీభావం ప్రకటించారు.

# సమ్మెలో కార్యదర్శులు.. విధుల్లో చేరిన రాష్ట్ర అధ్యక్షుడు

ముస్తాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులర్ చేయాలని చేపట్టిన నిరవధిక సమ్మె ముస్తాబాద్‌లో శనివారం కొనసాగింది. నాలుగేళ్లయినా తమను రెగ్యులర్ చేయడం లేదంటూ ఒకవైపు సమ్మె బాట పట్టగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు విధుల్లో చేరడం చర్చనీయాంశంగా మారింది. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజేశ్వర్‌రావు మూడేళ్లుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సమ్మె నోటీసును కూడా స్వయంగా రాజేశ్వర్‌రావు ఇచ్చారు. పలు జాక్ బాధ్యులతో మాట్లాడిన అనంతరమే తాను శనివారం విధుల్లో చేరానని ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. తమ డిమాండ్ల పరిష్కారంలో తగ్గేది లేదన్నారు. తమ పోస్టుల క్రమబద్ధీకరణ చేపట్టే వరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతు ఉంటుందన్నారు. కాగా ముస్తాబాద్ మండల పరిషత్ ఎదుట పంచాయతీ జూనియర్ కార్యదర్శులు ఆందోళన చేపట్టారు.

# మస్కట్‌లో బీఆర్ అంబేడ్కర్ జయంతి



వేడుకల్లో సేవా సమితి బాధ్యులు

సిరిసిల్లటౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను శనివారం మస్కట్‌లో ఘనంగా నిర్వహించారు. అక్కడి రువి సీబీడీ ఏరియా కొచ్చిన్ రెస్టారెంట్లో అంబేడ్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఇండియా నుంచి అంబేడ్కర్ నేషనల్ అవార్డు గ్రహీత, జర్నలిస్టు కాయితీ శంకర్ హాజరయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ఖ్యాతిని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఓమన్ మహిళా సేవాసమితి అధ్యక్షురాలు వంక రమ, కోఆర్డినేటర్ మొత్త బోతుల ధనలక్ష్మి, సెక్రటరీ పార్వతి, ట్రెజరర్ శ్రీదేవి, అంజలి, నాగమణి, మేడిపట్ల లక్ష్మణ్, సుంకపాక భూమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా..

**ఘనంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లిలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం పోచమ్మ బోనాలు తీశారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక సర్పంచ్ సుజాత మొక్కులు చెల్లించుకున్నారు.

**ఇంటింటా ఆరోగ్య సర్వే**

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో ఇంటింటా ఆరోగ్య సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావు చొరవతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ భారతి తెలిపారు.

**చర్యలు తీసుకోవాలి**

ఇల్లంతకుంట: దళితబంధు పథకం ద్వారా లబ్ధి పొందిన దళితుల వద్ద ఒక్కో ఎమ్మెల్యే రూ.3లక్షల వరకు లంచం తీసుకున్నారని, వారి చిట్టా తన వద్ద ఉందని సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు చేశారని, సీఎం తన వద్ద ఉన్న అవినీతి ఎమ్మెల్యే చిట్టా బయటపెట్టి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఐ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు.

**వార్డుసభ్యుల డిమాండ్లు నెరవేర్చాలి**

వేములవాడరూరల్: వార్డు సభ్యుల డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ వార్డుమెంబర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చెట్టిపల్లి నరేష్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన దాదాపు 13 వేల మంది వార్డుమెంబర్లకు రూ.3 వేల గౌరవ వేతనం అందించాలన్నారు. ఇన్సూరెన్స్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు, తదితర న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. లేకుంటే ఉద్యమ కార్యాచరణ విధివిధానాలను ప్రకటించి ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

**భరోసా సభ విజయవంతం చేయాలి**

రుద్రంగి: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో మే 7న నిర్వహించే బహుజన భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు కట్కూరి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

**ఎంపీపీ నిధులతో బోరు ఏర్పాటు**

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామంలో కుల సంఘానికి మండల పరిషత్ నిధులతో బోరు మోటారు ఏర్పాటు చేసేందుకు ఎంపీపీ పడిగెల మానస శనివారం భూమిపూజ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ జక్కుల రవీందర్, ఎంపీటీసీ నలువాల రేణుక, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఠాణాదివస్ సద్వినియోగం చేసుకోండి**

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మే 2న నిర్వహిస్తున్న ఠాణాదివస్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శేఖర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, గ్రామాల్లోని సమస్యలను చట్టపరంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఎస్పీ అఖిల్‌మహాజన్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచే కార్యక్రమం ప్రారంభమవుతుందని, సమస్యలున్న వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని కోరారు.

## పవర్ కట్

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ సిరిసిల్ల-3 ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతులు ఉన్నందున ఆదివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చంద్రంపేట, జ్యోతినగర్‌లలో కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సమాచారం

### నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మండలంలోని నాగారంలో శ్రీకోదండ రామస్వామి ఆలయంలో నూతన ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. నాగారంలో హనుమాన్ లక్ష్మణ సహితశ్రీ సీతారామచంద్రస్వామి నూతన ఆలయ పునః ప్రతిష్ఠ, సీతారామకల్యాణ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం మూలవిరాట్‌ల విగ్రహాలను ఊరేగింపుగా కొండపైకి తీసుకరావడం, మే 1, 2 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు, 3న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు, సీతారామచంద్రుల కల్యాణం, అన్నదానం నిర్వహిస్తామని వివరించారు. విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

# ఉపాధి పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని కేశన్నపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ చంద్రయ్య శనివారం పరిశీలించారు. జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.